క్లుప్తంగా

22 నుంచి చినమావుళ్లమ్మ జాతర మహోత్సవాలు



జాతర మహోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం 36 వార్డులో చిన్న మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 22నుంచి 27వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వహాకులు తెలిపారు. సోమవారం జాతర సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సేవాసమితి అధ్యక్ష ,కార్యదర్శులు రామాయణం వెంకటలక్ష్మీ తులసి పార్వతి, రేవూరి గోగురాజు, సభ్యులు పంజా లక్ష్మణరావు, మావూరి సుందరావులు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా స్థానికుల, దాతల, భక్తుల సహకారంతో జేష్ఠ మాస జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఐదు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 27వ తేదీ శుక్రవారం అఖండ అన్న సమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోరసిక వెంకటేశ్వరరావు, కొండేపూడి గణపతి, గ్రంధి బాలాజీ, మొదలవలస నాగేశ్వరరావు, సంఘ సేవకులు అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరిన ఇద్దరు విద్యార్థులు



మండలంలోని అజ్జమూరు గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో చేరిన ఇద్దరు విద్యార్థులు

ఆకివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన మెరుగుగా ఉందని భావించి, ప్రైవేట్ పాఠశాలకు స్వస్తి చెప్పిన ఇద్దరు విద్యార్థులు మండలంలోని అజ్జమూరు గరువులోని ఎంపీపీ పాఠశాలలో చేరినట్లు హెచ్ఎం ఆర్వీ.ఎస్.నారాయణ(విక్రమ్) చెప్పారు. సోమవారం విద్యార్థుల తండ్రి రామకృష్ణ తన ఇద్దరు పిల్లల్ని తమ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధనను అందిస్తున్నామని తెలుసుకుని పాఠశాలలో చేర్పించడం అభినందనీయమన్నారు. 3, 4 తరగతుల్లో కుందన, తేజమణిలు చేరడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లీష్, సాంకేతిక పరిజ్ఞానంతో సులభమైన మార్గంలో గణితం, తెలుగు బోధన చేయడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తుందని విక్రమ్ చెప్పారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



పాలకోడులో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పాలకోడేరు: జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సీహెచ్. వి. రంగనాయుడు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు వారాలకు మించి పొడి దగ్గు వచ్చి ఎవరైనా ఇబ్బంది పడుతుంటే క్షయ లక్షణాలు ఉన్నట్లుగా భావించి తప్పకుండా కఫం పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే నెల రోజులపాటు ప్రభుత్వం ఆరోగ్యశాఖ ద్వారా ఉచితంగా సరఫరా చేసే డాట్ మందుల కోర్సును వాడితే తప్పకుండా పూర్తిగా క్షయ వ్యాధి నయమవుతుందన్నారు. ఈ వ్యాధి పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి టీబీ రహిత భారత్ కు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు మరొక వైద్యాధికారి స్వర్ణ నిరంజని, సి హెచ్ ఓ సత్యనారాయణ, పీహెచ్ఎన్ కుమారి, హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు,ఎం. ఎల్. హెచ్. పి. లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐ రామకృష్ణకు సత్కారం



భీమవరంలో ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విధి నిర్వహణలో ప్రజాభిమానంతో పాటు అధికారుల మన్ననలు పొందడం అభినందనీయమని భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య అన్నారు. భీమవరం ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన మన్నె రామకృష్ణకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సత్కార సభలో ఆయన మాట్లాడారు. రామకృష్ణ సక్రమంగా విధులు నిర్వర్తించడమేగాక తన పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్ది ఉన్నత స్థాయిలోకి తీసుకువెళ్లడం తోటి ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం రామకృష్ణ, రాజ్యలక్ష్మి దంపతులను జయసూర్య ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్ సీపీ హయాంలో మహారాణులుగా మహిళలు

- భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు
- మహిళల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం



భీమవరం మహిళలకు వైద్య సేవలు అందజేస్తున్న దృశ్యం(ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): సామాజిక సాధికారతే లక్ష్యంగా నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక బృహత్తర సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసింది. ప్రతి మహిళా ఏటా కనిష్ఠంగా రూ.50 వేలు నంచి గరిష్ఠంగా రూ.లక్ష వరకు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారు. దీంతో తమ ఆర్థిక అవసరాల కోసం మగవారిపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా మహారాణులుగా చెలామణి అయ్యారు. నేడు అందుకు భిన్నంగా గత ఏడాది కాలంగా అమలు కాని హామీలతో దిగాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకాకపోవడంతో మహిళలు డీలాపడుతున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకూ నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సాయం, మహిలలకు బస్సులో ఉచిత ప్రయాణం, ఇంట్లో ఎంత మంది చదువుకుంటున్నా ఒక్కొక్కరికీ అమ్మ ఒడి పథకంలో రూ.15వేలు చొప్పున అందిస్తామని చేసిన ఆర్భాటపు వాగ్దానాలేవీ నెరవేరకోపవడంతో మహిళలు తాము మోసపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాడు అన్ని వర్గాల్లోనూ ఆనందం

వైఎస్సార్ చేయూత, జగనన్న చేదోడు, వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ పింఛన్ కానుక, ఆసరా, కాపు నేస్తం, అమ్మఒడి, ఈబీసీ నేస్తం, పంటల బీమా, రైతు భరోసా వంటి 27 సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తూ బడుగుల అభివృద్ధికి బంగారు బాటలు వేసింది, భీమవరం నియోజకవర్గంలోని 1.50 లక్షల కుటుంబాలల్లో మహిళలకు చేయూత, ఆసరా, కాపునేస్తం, ఈబీసీ నేస్తం ,అమ్మ ఒడి పథకాల ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. నేడు కూటమి ప్రభుత్వంలో మహిళలకు పైసా ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంతో గత ప్రభుత్వంలో మహిళలు చేపట్టిన వ్యాపారాలకు పెట్టుబడులు లేక వ్యాపారాలు మూతపడ్డాయి.

జగన్ పాలనే మేలు



కూటమి పార్టీల నేతలు మహిళల ఓట్లు కోసం అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి ఏడాదైంది. 19 ఏళ్లు నిండిన మహిళలకు తిరిగి వృద్ధాప్య పింఛన్ వచ్చేదాకా నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకూ ఆ హామీ ఊసేలేకుండా పోయింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. మళ్లీ ఆగస్టు నుంచి అంటున్నారు. మహిళలకు ఇచ్చిన ఏ హామీ అమలు చేయడం లేదు

టి. సూజత కొణితివాడ

వెన్నుపోటు దినం విజయవంతం చేయండి



వెనుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణమూర్తి

ఉండి: కూటమి ప్రభుత్వం ఏర్పడి జూన్ 4నాటికి ఏడాది పూర్తవుతున్నా సూపర్ సిక్స్‌తో పాటు ఇతర హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ చేపడుతున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళిలు పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గ పార్టీ కార్యాలయం పెదఅమిరంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు.మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీన నియోజకవర్గ కేంద్రం ఉండిలో నిర్వహించ తలపెట్టిన వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటలకు నియోజకవర్గ కేంద్రం ఉండి సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చని కారణంగా నిరసన తెలియచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ అబ్జర్వర్ ముదునూరి మురళీకృష్ణంరాజు, నర్సాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల పాల్గొంటారని తెలిపారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న దానికంటే ఇంకా ఎక్కువ చేస్తాం, మరింత మందికి చాలా ఇచ్చేస్తాం అని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రజలను నమ్మించి నట్టేట ముంచేసి వారిని వెనుపోటు పొడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. మీకు రూ.15 వేలు, మీకు రూ.15 వేలు అని తీవ్రస్థాయిలో ప్రచారం చేసిన నాయకులు రూ.15 పైసలు కూడా ఇవ్వలేదని అన్నారు. ప్రజాగ్రహాన్ని కూటమి నాయకులు చూపించేందుకే వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీ సుందర్‌కుమార్, కరిమెరక శివనాగరాజు, శేషాద్రి శ్రీనివాస్, తాటిపట్టి పెదవీరప్ప, గలావిల్లి ధనుంజయ, కరిమెరక మల్లిఖార్జునరావు, ఆర్‌కే, ఆంజనేయరాజు, బందెల ప్రమీల, నిమ్మల కేశవకుమార్, బందెల జార్జ్‌రాజు, రాయి శ్రీనివాస్, ఆలమూరి కృష్ణ, మహేష్, అంగర సునీల్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయాలి

వీరవాసరం: కూటమి నాయకులు ప్రజలకు చేసిన ద్రోహానికి నిరసనగా ఈనెల 4వ తేదీన వెన్నుపోటు దినాన్ని నిర్వహించనున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. నౌడూరు జంక్షన్‌లో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఏ ఒక్కరికి లబ్ధి చేకూరలేదని, రాష్ట్ర ప్రజలందరినీ మోసం చేసి మోసపూరిత హామీలను ఇచ్చి గద్దెనెక్కి ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచారని ఎద్దేవా చేశారు. బుధవారం ఉదయం వీరవాసరం మండలంలో నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి నందమూరి గరువు నుంచి భీమవరం ప్రకాశం చౌక్ వరకు ర్యాలీగా తరలివెళ్లి అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు, గూడూరు ఓంకారం, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, డివిడి ప్రసాద్, కడలి శ్రీరాములు, చికెలే మంగతాయారు, వీరవల్లి ప్రవీణ్, కాంద్రేకుల శ్రీను, ఆవాల శ్రీనివాస్, షేక్ సత్తార్ సాహెబ్, కర్రి రవి కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి

ఆకివీడు: ప్రజల్ని మోసం చేసిన వెన్ను పోటు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ఈ నెల 4వ తేదీన ఏర్పాటు చేసిన వెన్నుపోటు దినం ఉద్యమాన్ని ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని వైఎస్సార్‌సీపీ మండల పట్టణ కమిటీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ 147 హామీలు, సూపర్ సిక్స్ పథకాలి అమలుజేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నయవంచన చేసిందని వారు ధ్వజమెత్తారు. గతంలో కూడా చంద్రబాబు 100 అబద్ధాలు ఆడి అందలమెక్కారని, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి ఐదేళ్ల అనంతరం పసుపు కుంకుమ పేరుతో మోసగించారన్నారు. వాగ్దానాలు చేయడం , ప్రజల్ని మభ్యపెట్టడం, వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. భారీ వాగ్దానాలతో అందలమెక్కి మోసగించిన చంద్రబాబు కూటమికి బుద్ధి చెప్పేందుకు వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉండి మండల కేంద్రంలోజరిగే కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు, శ్రేయోభిలాషులు, ప్రజలు అధికంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పీజీఆర్ఎస్‌కు 5 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలో ఫ్లెయాష్ బ్రిక్స్ తయారీ కోసం టర్న్‌కీ స్కీంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ. 25,592లు చెల్లించినట్లు, ప్రస్తుతం దాని అవసరం లేనందున సొమ్మును విద్యుత్ శాఖ అధికారులు తిరిగి ఇవ్వాలని కొట్టు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారని చెప్పారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో సర్వే చేసిన ఎల్‌పీ నెంబర్ ద్వారా విడగొట్టిన మా సరిహద్దులను ధ్రువీకరించమని గ్రామానికి చెందిన గుట్టుముక్కల సూర్య సత్యనారాయణరాజు ఫిర్యాదు చేశారని చెప్పారు. మండలంలోని రాజులపేట గ్రామంలోని ఓల్డ్ వయ్యేరు పంట కాల్వపై అనుమతిలేకుండా నిర్మించిన ఐరన్ వంతెనను తొలగించాలని జీఎస్ఎస్.నారాయణరాజు ఫిర్యాదు చేశారు. గతంలో వంతెన తొలగించాలని ఏడు పర్యాయాలు ఫిర్యాదు చేసినా పీడబ్ల్యూడీ ఏఈ తొలగించలేదని పేర్కొనర్నారన్నారు. స్థానిక 2వ వార్డులోని ప్యాట్రిక్ నగర్‌లో 24 అడుగుల రోడ్డు నిర్మాణం, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంతానికి చెందిన ఎం.జోబాబు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

చౌక డిపోలేక 29వ వార్డు ప్రజల ఇబ్బందులు

భీమవరం: ప్రతి నెలా ఇంటింటికి వచ్చే రేషన్ సరుకులకు కూటమి ప్రభుత్వం మంగళం పాడడంతో భీమవరం మునిసిపాలిటీలోని 29వ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 29వ వార్డులో రేషన్ డిపో లేకపోవడంతో 30వ వార్డుకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. గతంలో 29వ వార్డులో రేషన్ డిపో నిర్వహించి అక్కడి ప్రజలకు నిత్యాసవర సరుకులు అందించేవారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటివద్దకే రేషన్ సరుకులు అందజేయడంతో ఆవార్డు ప్రజలంతా ఇంటివద్దనే రేషన్ సరుకులు తీసుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత జూన్ నెల నుంచి చౌక డిపోల వద్దనే రేషన్ సరుకులు అందజేస్తున్నారు. అయితే 29వ వార్డు ప్రజలు 30వ వార్డులోని చౌక డిపో వద్ద సరుకులు తెచ్చుకోవల్సిరావడంతో సుమారు 2 కిలోమీటర్ల దూరం వెళ్లి బియ్యం మూటలు తెచ్చుకోవాలంటే వృద్ధులు, మహిళలకు తీవ్ర ఇబ్బంది కరంగా ఉందని వాపోతున్నారు. అలాగే 29వ వార్డులో సచివాలయం లేకపోవడంతో 31వ వార్డు సచివాలయానికి వెళ్లాల్సివస్తున్నదని దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం లేకపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 29వ వార్డులో చౌక డిపో, వార్డు సచివాలయం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

14 డిమాండ్లతో ప్రభుత్వానికి వినతి

ఆకివీడు: ఈ నెల 5వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు జరుగనున్నాయని సంఘ ఆకివీడు ఏరియా అధ్యక్షుడు జీ.చిట్టిబాబు, కోశాధికారి ఎం .సుందర్‌పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఉద్యోగుల సమస్యల్ని చర్చించి, దీర్ఘకాలికంగా ఉన్న 14 సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంకు వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు.


మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: వీరవాసరం మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. వీరవాసరం మండలంలో జరుగుతున్న పలు కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. భీమవరం- రాయకుదురు- పాలకొల్లు ఆర్టీసీ బస్సు ట్రిప్పులను పెంచాలని, రాయికుదురులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వహించాలని సర్పంచ్ గెడ్డం భారతి కోరారు. అండలూరు మంచి నీటి చెరువు నుంచి వెంకటాపురం వెళ్లే మంచి నీటి పైప్‌లైన్ తోలేరు చెరువు నుండి వేసుకుంటే బాగుంటుందని అండలూరు ఎంపీటీసీ బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి కోరారు. ఉపాధి హామీ పనులను పారదర్శంగా నిర్వహించాలని, మండల పరిషత్ సమావేశంలో రాజకీయాలు మాట్లాడటం తగదని బొబ్బనపల్లి సర్పంచ్ గూడూరు ఓంకారం సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండల పురోగతికి కృషి చేయడం జరుగుతుందని ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని వివరించారు. సమావేశంలో ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, ఎంపీడీవో కిరణ్ కుమార్, తహసిల్దార్ ఏవీ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంపీటీసీలు వీరవల్లి కనక ఉషారాణి, బోను జోష్న దేవి, పంజా మంగతాయారు, గుల్లిపల్లి విజయలక్ష్మి, యల్లబండి ఇందిరా, ఆకుల లీలా కృష్ణ, సర్పంచులు, నీటి సంఘం అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


గాంధీనగర్ ఎస్టీ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో 7వ వార్డు సచివాలయ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలో 7వ వార్డు గాంధీ నగర్ ఎస్టీ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని సోమవారం సచివాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ నాయకుడు డి త్రిమూర్తులు మాట్లాడుతూ ఎస్టీ కాలనీలో వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలని, ఇంటింటికి మంచినీటి కుళాయి ఇవ్వాలని అనేకసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్టీ కాలనీలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక్కొక్క ఇంట్లో నాలుగు కుటుంబాలు నివాసం ఉంటున్నారని అందరికీ ఇళ్లులేక అద్దె ఇంటిలో ఉండలేక పడుతున్న అవస్థలు ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎస్టీల్లో అనేకమంది ఇప్పటికీ రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేవన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గాంధీ నగర్ ఎస్సీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని లేకుంటే రానున్న రోజుల్లో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని త్రిమూర్తులు హెచ్చరించారు.అనంతరం సచివాలయ సెక్రటరీకి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే విరాళాలు



వెంపలో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

భీమవరం అర్బన్: ప్రజా సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న సీపీఎం పార్టీ ప్రజలు ఇచ్చే విరాళాలు వారి కోసం ఖర్చు పెట్టి ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తుందని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రజా సమస్యలైన ఇళ్ల స్థలాలు, ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలపై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం .ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వర్లు, తోటి శుభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



ఉండిలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఉండి: అధికారం కోసం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు మండిపడ్డారు. ఈ సందర్భంగా సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సంధి రత్నకుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసారు.ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుపేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇంటిస్థలం ఇచ్చి వారు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల రుణం ఇస్తామని చేసిన వాగ్దానం నెరవేర్చాలని అన్నారు. అర్హులైన వారందరికీ వెంటనే ఇంటిస్థలాలు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఈ నెల 4వ తేదీకి ఏడాది కావస్తుందని అన్నారు. అయితే ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రజలను ఎందుకు మోసం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అంతే కాకుండా సూపర్ సిక్స్ అని గొప్పపేరు పెట్టి ప్రకటించిన పథకాలన్నీ వెంటనే అమలు చేయాలని లేకుండా సీపీఐ తరపున నిరసన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వెంకట్రావు అన్నారు. పార్టీ జిల్లా సమితి సభ్యుడు సనపల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏరు దాటక ముందు ఏరు మల్లయ్య అని ఏరుదాటాక గూడు మల్లయ్య అనే విధంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కోన గొలయ్య,తమరాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

7.65 లక్షల యోగా రిజిస్ట్రేషన్లు పూర్తి

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలో 7.65 లక్షలు యోగా రిజిస్ట్రేషన్లు పూర్తి అయినట్లు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల స్థాయిలో నిర్వహిస్తున్న యోగ పోటీలపై, యోగ అభ్యాసాలు చేసే ప్రాంగణాలను గుర్తించి రిజిస్ట్రేషన్లు చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డు, సచివాలయాల సెక్రటరీలతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సోమవారం సాయంత్రం నాటికి జిల్లాలో 7.65 లక్షల మంది యోగ అభ్యసనలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని వెల్లడించారు. అధికారులు తక్షణ చర్యలు చేపట్టి తగిన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. మాస్టర్ ట్రైనర్ నుంచి శిక్షణ పొందిన ట్రైనర్లు నేటి నుంచి మూడు రోజులపాటు సిటిజన్స్‌కు శిక్షణ ఇవ్వాలని అన్నారు. గ్రామ స్థాయిలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి మండల స్థాయిలో తప్పనిసరిగా పోటీలను నిర్వహించాలని, మండల స్థాయిలో గెలుపొందిన వారికి జిల్లా స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. యోగా కార్యక్రమాలను తూతు మంత్రంగా కాకుండా శ్రద్ధతో నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి ఏ.వి అప్పారావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఈడీఎం మేక కిరణ్ కుమార్, ఆయుష్ డాక్టర్లు శ్రీరామ్, హరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరీక్షా కేంద్రాల సేవలు విస్తృత పర్చాలి



భీమవరంలో కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందిస్తున్న కిసాన్‌మోర్చ నాయకులు

భీమవరం: జిల్లాలో వ్యవసాయం, ఆక్వా పరీక్షా కేంద్రాల సేవలు విస్తృత పర్చాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతిపత్రం అందించిన అనంతరం గంగరాజు విలేకర్లతో మాట్లాడారు. సమగ్ర వ్యవసాయ పరీక్షా కేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేసిన సమగ్ర వ్యవసాయ పరీక్షా కేంద్రాల్లో కేవలం విత్తనాల పరీక్షలు మాత్రమే జరుగుతున్నాయని, అలాగాకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొన్నిచోట్ల విత్తనాలు పరీక్షలు, కొన్నిచోట్ల ఎరువులు పరీక్షలు, మరికొన్నిచోట్ల భూసార పరీక్షలు నిర్వహించేలా సేవలు విస్తృత పర్చాలన్నారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దాసరి బాబి మాట్లాడుతూ జిల్లాలోని భీమవరం, నరసాపురం, పాలకొల్లు, ఉండి, గణపవరంలో నిర్మించిన ప్రభుత్వ ఆక్వా పరీక్షా కేంద్రాలను తక్షణం ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా నాయకులు కె రామరాజు, చెరుకూరి కృష్ణంరాజు, పులపర్తి నాగరాజు, అడ్డగర్ల గాంధీ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.